రౌడీ షీటర్‌పై కేసు నమోదు

• ఎస్సై మహేష్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రౌడీ షీటర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సతీష్‌ను గండి మాసానిపేట్‌కు చెందిన గడ్డం జగన్‌గౌడ్ బూతు మాటలు తిడుతుండగా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మల్దొడ్డి శ్రీనివాస్‌గౌడ్ అలా ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించగా.. జగన్‌గౌడ్ దురుసుగా ప్రవర్తిస్తూ నువ్వు మధ్యలో ఎందుకు వస్తున్నావని బూతు మాటలు తిడుతూ చంపేస్తానని బెదిరించినట్లు శ్రీనివాస్‌గౌడ్ ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారని, ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

తప్పల్లేకుండా ఓటర్ లిస్టు సిద్ధం చేయాలి

• డీపీవో శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ-సదాశివనగర్


రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో

తప్పుల్లేకుండా ఓటర్ లిస్టు సిద్ధం చేయాలని డీపీవో శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఓటరు లిస్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ఓటర్ లిస్టును తప్పులు లేకుండా తయారు చేయలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సంతోషకుమార్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతికి కారణమైన
ఆసుపత్రి సీజ్

• సర్టిఫికెట్ ఒకరిది.. వైద్యం మరొకరిది
• ఫార్మసిస్టు లేకుండానే మందుల విక్రయం
• సీజన్‌లో జ్వరం వస్తే ఆర్‌ఎంపి, పీఎంపీలు వైద్యం చేయరాదు
• డిప్యూటీ డీఎంహెచ్చో తనిఖీతో ఆసుపత్రులు మూసేసుకున్న వైద్యులు



మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్‌వో

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం వికటించి యువకుడు మృతికి కారణమైన ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ డిఎంహెచ్ఓ ప్రభు కిరణ్ శనివారం తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రిని, మెడికల్ షాప్‌ను సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. నాలుగు రోజుల క్రితం పట్టణ కేంద్రంలో స్వామి అనే యువకుడు తీవ్ర జ్వరంతో బస్టాండ్ సమీపంలో గల ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. వైద్యం వికటించి శుక్రవారం మరణించాడు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారులు మరణించిన స్వామి కుటుంబానికి శనివారం వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం మృతికి కారణమైన ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. దీంతో అధికారుల తనిఖీల్లో విస్తుగొల్పే విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ప్రైవేట్ ఆస్పత్రి ఓ వైద్యురాలిపై రిజిస్ట్రేషన్ ఉండగా.. ఆస్పత్రిలో వైద్యం మరొకరు నిర్వహిస్తున్నారు. అలాగే ఆసుపత్రికి సంబంధించిన మెడికల్ షాపు ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ ఒకరిపై ఉండగా.. మెడికల్ షాపులో ఫార్మసిస్టు లేకుండానే మందులను ఎలాంటి అనుభవం లేని వ్యక్తులు విక్రయిస్తున్నారు. విషయాన్ని గమనించిన డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆసుపత్రి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసి ఆస్పత్రి, మెడికల్ షాప్‌ను సీజ్ చేశారు.


ఆస్పత్రిని సీజ్ చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌వో

సీజనల్ వ్యాధుల కాలంలో వైద్యం చేయరాదు..

సీజనల్ వ్యాధుల కాలంలో ఆర్.ఎం.పి, పీఎంపీ వైద్యులు ఎలాంటి వైద్యం చేయవద్దని డిప్యూటీ డిఎంహెచ్‌వో ఆదేశించారు. ఒకవేళ వైద్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫార్మసిస్టు లేకుండా మెడికల్ షాప్ నిర్వాహకులు మందులు ఇవ్వవద్దని సూచించారు. సీజనల్ వ్యాధుల కాలంలో ఎలాంటి వ్యాధి సోకినా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్యులను సంప్రదించాలని, పరిస్థితి విషమిస్తే జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లాలని తెలిపారు.

డిఎంహెచ్ఓ తనిఖీతో మూసివేసిన ఆస్పత్రులు..

యువకుడు మృతికి కారణమైన ఆసుపత్రిని డిప్యూటీ డీఎంహెచ్వో తనిఖీలు చేస్తున్నట్లు మండలంలోని ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులకు సమాచారం అందగా ఒక్కసారిగా అందరూ వైద్యులు ఎక్కడ డిప్యూటీ డిఎంహెచ్ఓ తమ ఆసుపత్రులను తనిఖీ చేస్తారన్న అనుమానంతో ఆస్పత్రిని మూసివేసినట్లు సమాచారం. ఈ తనిఖీలలో మండల వైద్యాధికారి యేమిమా, పిహెచ్ఎన్ రాణి, వైద్యసిబ్బంది సతీష్, తదితరులున్నారు.

బోరుబావుల్లో
అడుగంటిన భూగర్భజలాలు

• పిట్లం మండలంలో అంతంతమాత్రమే వర్షం
• ఎండుముఖం పడుతున్న పంటలు
• ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్న రైతులు

నవతెలంగాణ-పిట్లం



ఖరీఫ్ సీజన్‌కు గానూ వర్షాలు అంతంత మాత్రంగానే కురియడంతో భూగర్భ జలాలు అడుగంటడంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. 2024-25 సంవత్సరం రబీ సీజన్‌కుగానూ 16 వేలకు పైబడి ఎకరాల్లో వరి పంట సాగుచేసినప్పటికీ పుష్కలమైన వర్షం లేని కారణంగా పంట బోరుబావుల వద్ద నీటి సామర్థ్యం తగ్గిపోయి పంటపొలాలు ఎండుముఖం పడుతున్నాయని రైతులు విలవిల్లాడుతున్నారు.


మండలంలోని తిమ్మానగర్ తాండకు చెందిన దేవ్ సోత్ గోవింద్ నాయక్ తనకున్న 10 ఎకరాలకు గాను 5బోర్లు ఉన్నప్పటికీ వాటిలో పూర్తి నీటి సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు వర్షం తగినంత కురియకపోవడంతో వరి పంట ఎండుముఖం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మండల కేంద్రానికి చెందిన కుమ్మరి శేఖర్‌కు తిమ్మానగర్ శివారులో తనకున్న ఐదు ఎకరాల భూమిలో బోర్ మోటార్లను నమ్ముకుని ప్రతి యేడు మాదిరిగా వరి పంట సాగు చేశాడు. బోర్ మోటార్లలో నీళ్ల అడుగంటిపోవడంతో పంట ఎండు ముఖం పడుతోంది. పంటను ఎలాగైనా దక్కించుకోవాలనే తాపత్రయంతో రెండు రోజుల క్రితం ట్యాంకర్‌ల సహాయంతో పంట పొలాలకు నీరందించారు. వర్షకాలం ప్రారంభమై రెండు నెలల 15 రోజులే గడుస్తున్నప్పటికీ మిగతా రోజులలో పంటలు పండించేది ఎలా అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని రైతులు అధికారులను కోరుతున్నారు.


ట్యాంకర్‌తో పొలానికి నీరు పదుతున్న రైతు

మధ్యాహ్న భోజనం
వండేందుకు ఇబ్బందులు

• కిచెన్‌షెడ్‌కు పైకప్పు లేని వైనం
• నిధులు మంజూరుకాకపోవడంతో నిలిచిన పనులు

నవతెలంగాణ-బోధన్


కిచెన్‌షెడ్డుకు పైకప్పు లేకపోవడంతో ఆరుబయటే వంట

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసి)లో మధ్యాహ్న భోజనం వంట చేయడానికి కిచెన్ షెడ్ సరిగా లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం వంట చేయడానికి కిచెన్ షెడ్డుకు పైకప్పు లేకపోవడంతో నిర్వాహకులు వర్షాకాలం సందర్భంగా వంట చేయడానికి అవస్థలు పడుతున్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ మంజూరైనా.. ఆ పనులు ముందుకు సాగలేదు. మరుగుదొడ్ల నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది. కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్ పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. దాంతో మధ్యాహ్న భోజనం చేయడానికి విద్యార్థులకు కూర్చోవడానికి డైనింగ్ హాల్ లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యలో జిల్లాలోనే ద్వితీయ స్థానంలో ఉన్న ఈ పాఠశాలకు సమస్యలు వెంటాడుతున్నాయి. గత కొన్ని నెలల క్రితం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన పనులు పూర్తి చేయడానికి అధికారులను ఆదేశించారు. కానీ సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. ఇప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి స్పందించి మరుగుదొడ్ల నిర్మాణం, కిచెన్ షెడ్, డైనింగ్‌హాల్ నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సమయానికి బస్సులు నడపాలి

• బీబీపేట్‌లో విద్యార్థుల రాస్తారోకో

నవతెలంగాణ-కామారెడ్డి

బస్సులు సమయానికి నడపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. శనివారం బీబీపేట్ మండల కేంద్రంలో స్ట్రీట్ లైట్ వద్ద విద్యార్థులు బస్సులను నిలిపి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. సరైన సమయంలో బస్సులు రాకపోవడంతో తాము కళాశాలకు ఆలస్యం గా వెళ్లాల్సి వస్తుందని, తద్వారా క్లాసులు మిస్సవుతున్నామని అన్నారు. డిపో మేనేజర్‌కి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.



బస్సులను నిలిపేసి రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

తెరుచుకున్న పోస్టాఫీస్

• నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-రామారెడ్డి



ఎట్టకేలకు పోస్టాఫీస్ తెరుచుకుంది. మండలంలోని పోసానిపేట్ గ్రామంలో నెల రోజుల నుంచి పోస్టల్ సేవలు అందకపోవడంపై నవతెలంగాణలో 'నెల రోజులైనా తెరుచుకోని పోస్టాఫీస్' అనే శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో పోస్టల్ అధికారులు స్పందించారు. ఇంచార్జ్ పోస్ట్‌మెన్‌ను నియమించి శనివారం కార్యాలయాన్ని తెరవడంతో ప్రజలు పోస్టల్ సేవలను వినియోగించుకున్నారు.


నిరసనలో పెద్ద ఎత్తున పాల్గొన్న రైతులు

రుణమాఫీ చేయకుంటే
అసెంబ్లీని ముట్టడిస్తాం

• ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి
• రైతుఐక్యకార్యాచరణ కమిటీ డిమాండ్
• చలో ఆర్మూర్‌లో పెద్దఎత్తున పాల్గొన్న రైతులు

నవతెలంగాణ-ఆర్మూర్

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని రైతుఐక్యకార్యాచరణ కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. శనివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి సెయింట్‌పాల్ స్కూల్ వద్ద రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఆర్మూర్ కార్యక్రమంలో భాగంగా పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు ప్రభాకర్, పి.తిరుపతిరెడ్డి, లింగారెడ్డి, దేగం యాదగౌడ్, నూతల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాల్లో కొద్దిమంది రైతులకు మూడు విడతలలో రుణం మాఫీ అయిందని, అనేక మందికి రేషన్ కార్డులలో పేరు లేకపోవడం, రుణం బకాయి ఎక్కువగా ఉందని, ఆధార్ బ్యాంకు ఖాతాల్లో పేర్లు వేరువేరుగా ఉన్నాయని కొర్రీలు పెడుతూ రైతన్నలను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఏ పంట అయినా సరే 500 బోనస్, రూ.15వేల రైతు భరోసా సాధించుకోవాలని.. తెలంగాణ రైతాంగం ఏకమై ఐదు రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేసి అసెంబ్లీని ముట్టడిస్తామని అన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన ఓ రైతు ధరణి సమస్యతో అప్పులతో సతమతమై ఉరివేసుకొని చనిపోయాడని గుర్తుచేశారు. ప్రతి పంటకూ రెండు లక్షల రుణమాఫీ, రైతు బీమా ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతన్నలను మోసం చేయడం సరికాదని, రైతన్నలను రోడ్డుమీదికి తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రైతుల నిరసన దీక్షకు సంఘీభావం తెలపడానికి వచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. డిసెంబర్ 7న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి 9వ తేదీన అందరికీ రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేశారని అన్నారు. బువ్వపెట్టే రైతులను ఏడిపిస్తే పుట్టగతులు లేకుండా పోతారని మండిపడ్డారు. ఉద్యమ గడ్డ ఏ ఉద్యమం చేసినా.. ఆర్మూర్ నుంచి మొదలవుతుందని జీవన్‌రెడ్డి అన్నారు.

భారీగా పోలీసు బలగాల మోహరింపు..

రైతు ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపుమేరకు రుణమాఫీ కోసం రైతుల నిరసన దీక్ష చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా మోహరించారు. ఇంచార్జ్ అసిస్టెంట్ కమిషనర్ బస్వారెడ్డి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు దేవారం, నవీన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగరి విట్టల్‌రావు, బిజెపి నాయకులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, పల్లె గంగారెడ్డి, పాలెపు రాజు, ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు చెందిన రెండువేలకు పైగా మంది రైతులు పాల్గొన్నారు.

వివాదాలు ఎక్కడో.. పరిష్కారాలూ అక్కడే

• తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ సుజయ్‌పాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

పౌర సమాజంలో వివాదాలు ఎక్కడ ఉంటాయో, పరిష్కారాలు అక్కడే ఉంటాయని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ సుజయ్‌పాల్ అభివర్ణించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహకారంతో తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రాగణంలోని న్యాయసేవ సదన్‌లో నిర్వహించిన కమ్యూనిటీ మిడియేటర్స్‌కు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగింపు ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రధానోపన్యాసం చేశారు. మనుషుల మధ్య తలెత్తిన వివాదాలు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే వీలు ఉన్నదని తెలిపారు. మధ్యవర్తిత్వానికి ప్రాచీన చరిత్ర ఉన్నదని, ఆ స్ఫూర్తితో మధ్యవర్తిత్వ చట్టం అమలు చేయబడుతున్నదని తెలియజేశారు. జాతిపిత మహాత్మాగాంధీ దక్షిణ ఆఫ్రికాలో నివసిస్తుకాలంలో మధ్యవర్తిత్వ వ్యవస్థకు ఎనలేని ప్రాధాన్యం కల్పించారని అన్నారు. భార్యాభర్తల మధ్య ఉన్న అంతర్గత సమస్యలు చట్ట సంబంధితమైనవా అంటూ జస్టిస్ సుజొయ్ ప్రశ్నిస్తు అవన్ని కుటుంబ సభ్యుల మధ్య పరిష్కరించుకునే వేనని పేర్కొన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులను పోషించని వారి సంతానం మధ్యవర్తిత్వ భాషను అర్థం చేసుకోవాలని కోరారు. కుటుంబ వివాదాలు అన్ని కూడా సామాజిక సమస్య లేనని ఆయన తెలిపారు. సమాజపు సమూహాములో సమస్యలను మధ్యవర్తిత్వంతో శాశ్వత పరిష్కారం చేసుకోవచ్చు నిఅన్నారు. మనిషికి వచ్చే ఒక వైరస్ మనుషుల మధ్యకు చాలా వేగంగా విస్తరించినట్లుగా మంచి విషయాలు అంతే త్వరగా చేరాలని జస్టిస్ సుజొయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సమాజంలోని అన్ని కమ్యూనిటీలకు చెందిన వ్యక్తులతో కమ్యూనిటీ మీడియేటర్లను ఏర్పాటు చేసి మధ్యవర్తిత్వ విలువ లు, ప్రయోజనాలు తెలియజేస్తూ రాష్ట్రంలోనే ప్రప్రథమంగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్ రావు ప్రసంగిస్తూ ఒక భవనానికి పునాది ఎంత బలమైనదో మధ్యవర్తిత్వానికి కమ్యూనిటీ మెడియేటర్స్ అంత బలమైన వారని తెలిపారు. ప్రజా సమూహాలలో నెలకొన్న సమస్యలను తొలగించడంలో మధ్యవర్తిత్వ ప్రతినిధుల పాత్ర గణనీయమని అన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే వారికి పరిస్థితులపై, సమస్యలపై అవగాహన ఉంటుందని కమ్యూనిటీ మెడియేటర్స్ రోల్ మోడల్‌గా నిలుస్తారని జస్టిస్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. మనుషుల మధ్య నెలకొన్న చిన్న, చిన్న విభేదాలు మొదటి దశలోనే తెంచివేయాలని సూచించారు. నేర రహిత సమాజం నిర్మించడానికి కృషి చేయాలని కోరారు. వివాదాలను, సమస్యలను ఎదుర్కొంటున్న వారికి, వారివారి గ్రామం, గల్లీలోనే పరిష్కారం లభిస్తుందనే విశ్వాసాన్ని కలిగించాలని అన్నారు. కమ్యూనిటీ మీడియేటర్స్‌పైన గురుతరమైన బాధ్యతలు ఉన్నాయని జస్టిస్ శ్రీనివాస్ రావు గుర్తుచేశారు. నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల మాట్లాడుతూ సమయానికి అనుకూలంగా సమస్యలు విని, అర్థం చేసుకుని న్యాయార్థులను పరిష్కరించుకునే దిశగా ప్రేరేపించాలని అన్నారు. కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ వర ప్రసాద్ మాట్లాడుతూ లోక్ అదాలత్, మధ్యవర్తిత్వ వ్యవస్థలలో కమ్యూనిటీ మీడియెటర్స్ ప్రధాన భూమిక నిర్వహించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ సభ్య కార్యదర్శి సి.హెచ్ పంచాక్షరీ కార్యక్రమంలో వందన సమర్పణ చేశారు. మూడు రోజుల కమ్యూనిటీ మీడియేటర్స్ శిక్షణ తరగతులలో ప్రెజెంటేషన్స్ ఆఫ్ మొమెంటర్స్ డాక్టర్ మహ్మద్ శమీమ్, గిరిబాల సింగ్ మధ్యవర్తిత్వానికి సంబంధించిన సూక్ష్మ అర్థాలను వివరించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి వ్యవహరించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు శ్రీనివాస్, ఆశాలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు గోపికృష్ణ, చైతన్య, హరికుమార్, శ్రీనివాసరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఉదయ కృష్ణ, ప్రమోద్, శుభం, న్యాయవాదులు మానిక్ రాజు, ఆశా నారాయణ, అంకిత, రణదీశ్, న్యాయసేవ సంస్థ పర్యవేక్షకులు పురుషోత్తం గౌడ్, చంద్రసేన రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్ పాల్, జె.శ్రీనివాస్ రావు శనివారం నిజామాబాద్ పర్యటనకు హాజరైన సందర్భంగా శనివారం జిల్లా ఉన్నతాధికారులు వారికి ఘన స్వాగతం పలికారు. జిల్లా కోర్టు భవన సముదాయంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో మూడు రోజుల పాటు కొనసాగిన కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముందుగా వారు స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకుని, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టు జడ్జీలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, కలెక్టర్‌తో హైకోర్టు న్యాయమూర్తులు అతిథి గృహంలో కొద్దిసేపు భేటీ అయ్యారు.

కేరళ బాధితులకు ఆర్థిక సహాయం


ఆర్థికసాయం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులో గల బ్యావరేజ్ గేజ్ డిపోలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కేరళ తుఫాను బాధితులకు సహాయం రూ.2వేలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ.. సిపిఎం పార్టీ ఎల్లవేళలా పేద ప్రజలకు అండగా ఉంటుందని, ఎటువంటి విపత్కర పరిస్థితిలోనైనా సహాయానికి ముందుంటుందని అన్నారు. కరోనా సమయంలో కూడా ముందుండి సహాయం అందించినట్లు తెలిపారు. ఇప్పుడు కూడా అకాల వర్షాలకు అతలాకుతలమైన కేరళ రాష్ట్రానికి మా వంతు సహాయం చేయడంలో సిపిఎం పార్టీ ముందుంటుందని అన్నారు.

కాజేసిన సొమ్మును తిరిగి ఇప్పించిన ఎంపీడీవో


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఈరోజు ఎంపీడీవో సంతోష్ కుమార్ దేవక్కపేట్ గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. 13 మంది లబ్ధిదారులకు గాను 11 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఇక రావు అనుకున్న డబ్బులను తిరిగి ఎంపీడీఓ ఇప్పించడం వల్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎంఆర్ఎఫ్ తో పేదల వైద్యానికి భరోసా

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి
- ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సహాయం చెక్కులతో పేదల వైద్యానికి భరోసా లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన సుందరగిరి దిలీప్ కు రూ.29వేలు, కోటగిరి రాజగౌడ్ కు రూ.55వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సహాయం చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా సుంకేట రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ కృషితో ప్రభుత్వం ఆర్థిక సహాయం చెక్కులను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు నూకల బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, వేముల గంగారెడ్డి, ఊట్నూరి ప్రదీప్, సుంకేట శ్రీనివాస్, పూజారి శేఖర్, దూలూరి కిషన్ గౌడ్, పాలెపు చిన్న గంగారం, నల్ల సాయికుమార్ గుప్తా, సుంకరి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో స్థిరపడడానికి ఇదో సదవకాశం

- ఉమ్మడి రాష్ట్ర డైరెక్టర్ విశ్వనాథరెడ్డి


మాట్లాడుతున్న ఉమ్మడి రాష్ట్ర డైరెక్టర్ విశ్వనాథరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తమ జీవితంలో స్థిరపడడానికి ఏదో మంచి సదవకాశమని, దీనిని యువత యువకులు సద్వినియోగం చేసుకోవడం అభినందనమని ఎస్బిఐ ఉమ్మడి రాష్ట్రాల డైరెక్టర్ విశ్వనాథరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఘన్‌పూర్ శివారులోని ఆర్‌ఎస్ఈటిఐ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థను డైరెక్టర్ విశ్వనాథ రెడ్డి సందర్శించారు. సంస్థలో ప్రస్తుతం జరుగుతున్న మగ్గం వర్క్, టైలరింగ్ విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడ అందిస్తున్న వసతులు, ట్రైనింగ్, ఇతరత్రా విషయాలను అడిగి తెలుసుకున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో నాణ్యమైన ట్రైనింగ్‌ను జీవితంలో స్థిరపడటానికి ఇది మంచి అవకాశమని, దీనిని అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ నేర్చుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటు స్వతహాగా వ్యాపారం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్, నవీన్, లక్ష్మన్, జమున, రాధిక పాల్గొన్నారు.

దోమలను నివారిస్తే ఆరోగ్యంగా ఉంటారు

- జిల్లా సబార్డినేట్ ఆఫీసర్ సాయన్న



మాట్లాడుతున్న జిల్లా సబార్డినేట్ ఆఫీసర్ సాయన్న

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

దోమలను నివారిస్తే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సబార్డినేట్ ఆఫీసర్ సాయన్న అన్నారు. మండలకేంద్రంలోని తెలంగాణ ఆదర్శపాఠశాల ,కళాశాలలో శనివారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం జక్రాన్ పల్లి వైద్యబృందం వారు, జిల్లాసబార్డినేట్ అధికారులు పాఠశాల కళాశాల ను సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులకు (సీజనల్ వ్యాధులు) వర్షాకాలంలో వచ్చే వ్యాధులను గురించి అవగాహన కల్పించి, వ్యాధులు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. దోమల వల్ల వ్యాపించే (డెంగ్యూ, మలేరియా, బోధకాలు) వ్యాధులపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి, తల్లిదండ్రులకు తెలియజేసి ఫ్రైడే డ్రై డేను నిర్వహించి దోమలను నివారిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సబార్డినెట్ ఆఫీసర్ సాయన్న గారు, జక్రాన్ పల్లి హెల్త్ సుపెరువైజర్ సిద్ధికి గారు, హెల్త్ అసిస్టెంట్ రాజు, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు ఉచిత విద్య

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో చైల్డ్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారుల తల్లులతో ఉచిత విద్యను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మమత, హెల్త్ సుపర్ వైజర్ ప్రేమల, ఏఎస్ఎం అనురాధ, శాంత, గ్రామపంచాయతీ కార్యదర్శి రాకేష్, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు భారతి, అంజలి దేవి, రజిత, నషిమ, పిల్లల తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

నగరంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- అనన్య కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని ఆనంద్ నగర్‌లో ఇటీవల మురుగు కాల్వలో పడి చనిపోయిన అనన్య కుటుంబాన్ని అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం పరామర్శించారు. సంఘటనకు గల వివరాలు స్థానికులతో, అధికారులతో మాట్లాడి తెలుసుకున్న ధన్‌పాల్ అనంతరం మీడియాతో మాట్లాడారు. జరిగిన విషాదసంఘటన చాలా బాధాకరమైందని అన్నారు. తను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి మునిసిపల్ కమిషనర్, అధికారులకు పలుమార్లు చెప్పానని అన్నారు.

నగరంలో లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్స్, నాలా కబ్జాల సంబంధిత సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించినా ఇప్పటివరకు పూర్తి స్థాయిలో పనులు


అనన్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

జరగకపోవడంపై మండిపడ్డారు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో ఇప్పటికి కనీసం వీధి దీపాల ఏర్పాటులో కూడా మునిసిపల్ శాఖ ఫెయిల్ అయ్యిందని, అధికారులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో పనిచేయాలనీ నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. నగర సమస్యలపై కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని డ్రైనేజీ, రోడ్స్, వీధిదీపాల కల్పన వంటి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనన్య కుటుంబానికి పదివేల ఆర్థికసహాయం, నిత్యావసర సరుకులు అందించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి 27వ డివిజన్ కార్పొరేటర్ వెల్డింగ్ నారాయణ, 9వ డివిజన్ కార్పొరేటర్ సాదు సాయి వర్ధన్, బిజెపి నాయకులు ఇల్లెందుల ప్రభాకర్, మఠం పవన్, ఆనంద్, చిరంజీవి, అంబదాస్ రావు, హరీష్, వెంకటరమణ, కోడూరు నాగరాజు, మఠం రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐటి హబ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా


ధర్నా చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఐటీ హబ్ వద్ద అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10 నెలల క్రితం ఐటీ హబ్ లో 19 మందిని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియమించారని తెలిపారు. ఇప్పుడు కొత్త ఏజెన్సీ వారు వచ్చి తమను వెళ్లిపోవాలని చెప్పారన్నారు. తమను ఉద్యోగాల్లో కొనసాగించాలని వారు కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, అనసూయ, కనకమ్మ, సురేష్ పాల్గొన్నారు.

బిసి సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

- పిడిఎస్‌యూ డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోగల బిసి బాలబాలికల సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కారించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి స్రవంతి కి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా పిడిఎస్యు నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. జిల్లానుండే కాకుండా వివిధ జిల్లాల నుండి పేద విద్యార్థులు తమ చదువుల నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి రావడం జరుగుతుందని తెలిపారు. కానీ విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా ప్రభుత్వ హాస్టల్లు లేకపోవడం, ఉన్న హాస్టల్లో మౌలిక వసతులు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా నగరంలో కేవలం బాలురకు మూడు, బాలికలకు మూడు చొప్పున ప్రభుత్వ హాస్టళ్లు ఉండడం బాధాకరమన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా హాస్టల్లో వసతులను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. నాందేవాడ, మిర్చి కాంపౌండ్ బాలుర వసతి గృహం కూలిపోయే స్థితిలో ఉందని, విద్యార్థులు ప్రాణాలు అరచేతుల పెట్టుకుని ఉంటున్నారని తెలిపారు. వెంటనే బీసీ బాల బాలికల వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టల్ వసతి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి ఇవ్వాలని కోరారు. కళాశాలలకు సమీపంలో ఉండే విధంగా నూతన భవనాలు నిర్మించాల్సిందిగా కోరారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ వసతి గృహాల అద్దె భవనాల బిల్లులను, విద్యార్థుల మెస్ కాస్మొటిక్ ఛార్జీలను విడుదలచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వారానికి ఒక్కసారైనా జిల్లా అధికారులు సంక్షేమ వసతి గృహాలను సందర్శించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలన్నింటిని పరిష్కరించే విధంగా జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులు లు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు నసీర్, సంతోష్, శన్ను వర్మ నికిత, దివ్య రాణి, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అదజేస్తున్న పిడిఎస్‌యూ నాయకులు

దంతాలు ఆరోగ్యానికి సూచికలు

- డాక్టర్ ఆదిత్య రాజ్
- సారంగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో దంత వైద్య శిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

దంతాలు ఆరోగ్యానికి సూచికలని, అందుకే దంతాలను పరిరక్షించుకోవాలని, ఈ మాత్రం అశ్రద్ధ చేయకుండా ఇబ్బంది అయిన సందర్భంలో డాక్టర్లు సంప్రదించాలని మేఘన డెంటల్ హాస్పిటల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆదిత్య రాజ్ అన్నారు. శనివారం ఆయన తన డాక్టర్ల బృందంతో సారంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పలు సూచనలు చేశారు. పళ్లు తోముకునే పద్ధతులను వివరించారు. తీవ్ర సమస్యలు గల విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సల్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించడం పట్ల మేఘన డెంటల్ కాలేజ్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులు చెప్పిన సూచనలు పాటించి విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సాహితి, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ పల్లవి, డాక్టర్ శ్రీమాన్, డాక్టర్ వసీదుద్దీన్, డాక్టర్ అనూష, ఉపాధ్యాయులు డి గోపాల్, మహమ్మద్ జావిద్, సి. విద్యా సాగర్, గంగాధర్, ఘనపురం దేవేందర్, శ్రీలత, సుజాత, అనిత తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య పది, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని కమలాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్టడీ సెంటర్ ద్వారా దూర విద్యా విధానంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నా మని ప్రధానోపాధ్యాయులు ఎం.అమర్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలోపు చదువు మానేసిన వారు, పదో తరగతి తర్వాత పైచదువులు చదవలేని వారు ఇంకా ఆసక్తి ఉన్న వయోజనులందరూ ఓపెన్ స్టడీ సెంటర్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవడానికి ఇది మంచి అవకాశమని వివరించారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ షెడ్యూల్ ప్రారంభమైందన్నారు. పదవ తరగతి కొరకు ఆగస్టు 8 సెప్టెంబర్ 30 వరకు ఎలాంటి లేట్ ఫీజు లేకుండా, అక్టోబర్ 1 నుండి -అక్టోబర్ 31 వరకు వంద రూపాయల లేట్ ఫీజుతో చెల్లించుకోవాలని సూచించారు. జాత పర్చవల్సినవిపాత పాఠశాల టిసి లేదా బోనా ఫైడ్,జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు ఇంటర్మీడియట్ కోసం ఆగస్టు 8 నుండి సెప్టెంబర్ 30 ఏలాంటి అపరాధ రుసుం లేకుండా, అక్టోబర్ 1 నుండి -అక్టోబర్ 31 వరకు 200 వందల రూపాయల లేట్ ఫీజుగా చేర్పించాలని తెలిపారు. దానితోపాటు పదవ తరగతి టిసి, పదవ తరగతి మెమో, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ముప్కాల్ వ్యవసాయాధికారిగా జి.సాయికృష్ణ



నవతెలంగాణ-ముప్కాల్

మండల వ్యవసాయాధికారిగా జి.సాయికృష్ణ శనివారం బాధ్యతలను స్వీకరించారు. బదిలీల్లో భాగంగా భీంగల్ నుంచి ముప్కాల్‌కు వచ్చారని ఏఈవో సరేష్ తెలిపారు. ఇక్కడ పనిచేసిన రాజ్ కుమార్ మరో చోటికి బదిలీపై వెళ్లారు. మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సాయికృష్ణకు పలువురు రాజకీయ ప్రముఖులు, రైతు సంఘం నాయకులు అభినందనలు తెలియజేశారు..

కోతులతో ఇబ్బందులను తొలగించండి

- రేంజ్ అధికారి రవిమోహన్ భట్‌కు వినతి


రేంజ్ అధికారికి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అనునిత్యం గురుకులంలో కోతులతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాటి నుండి ఉపశమనం కలిగించాలని కోరుతూ తెలంగాణ గురుకుల గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ ఆధ్వర్యంలో అధ్యాపకులతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శనివారం ఇందల్ వాయి రేంజ్ కార్యాలయం లో రేంజ్ అధికారి రవి మోహన్ భట్‌కు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది ప్రారంభించిన బాలికల గురుకులంలో కోతులతో నిత్యం సాహసం చేయవలసి వస్తుందని ప్రతిరోజు ఒక విద్యార్థినిని కోతులు కరుస్తున్నాయని అన్నారు. దీన్ని నివరించడానికి ఫారెస్ట్ అధికారులు సహకరించాలని వారన్నారు. వందలాది మంది విద్యార్థులు ఉన్న ఈ గురుకులంలో అధ్యాపకులు తరగతి గదిలో బోధించి బయటకు రావడం గగనమైపోయిందని తెలిపారు. కోతులు సైతం తరగతి గదులు, వరండా, వంటగది, విద్యార్థులు పడుకునే గదుల్లో సైతం వచ్చి వీరవిహారం చేస్తున్నాయని, స్నానపు గదులకు వేళ్ళి వాస్దమన్న రాలేని పరిస్థితులు దాపురించయని తెలిపారు. దీన్ని నివారించడానికి తమ వంతు సహకరించాలని వారు ఇచ్చిన వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో వైస్ ప్రిన్సిపాల్, మోహన్, అధ్యాపకులు ఉన్నారు.

విద్యార్థుల మధ్య ఎంపీ అర్వింద్


చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

నవతెలంగాణ-ముప్కాల్

ఆయాప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, కృష్ణవేణి ఉన్నత పాఠశాల, న్యూ హరిజోన్స్, రెంజర్ల గ్రామంలోని విజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థుల మధ్య కృష్ణష్టమి వేడుకలు చేపట్టారు. వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు కృష్ణుని వేషధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పర్యటనకు వచ్చిన ఎంపీ ధర్మపురి అర్వింద్ పాఠశాల విద్యార్థుల నడుమ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన వెంట బీజేపీ నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ ఏలేటి మల్లికార్జున రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, బీజేపీ జిల్లా, మండల నాయకులు గడ్డం సంతోష్ రెడ్డి, ముస్కు నర్సయ్య, నాయకుడు సంతోష్, చిల్క దినేష్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నాయకుడు పద్మ, కల్లు స్వామి, నర్సింగ్ దాస్, లోక రాములు తదితరులు పాల్గొన్నారు..

నాసిరకం, కల్తీమద్యం విక్రయాలు అరికట్టాలి

- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

నవతెలంగాణ-సిరికొండ/ధర్పల్లి

సిరికొండ, ధర్పల్లి మండలాల్లో నాసిరకం, కల్తీ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బెల్టు షాపులలో విచ్చలవిడిగా విక్రయిస్తున్న నాసిరకం, కల్తీ మద్యంను అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం సిరికొండ, ధర్పల్లి మండల కేంద్రాల్లో పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరికొండ, ధర్పల్లి మండలాల్లో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి మద్యం ప్రియులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. గ్రామాల్లో వీడిసిలతో కలిసి టెండర్లలో వేలం పాడిమద్యాన్ని విచ్చలవిడిగా, ఇష్టమైన ధరలకు విక్రయిస్తూ మద్యం ప్రియులను ఆర్థికంగా దోపిడికి గురి చేస్తున్నారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న మద్యం బెల్ట్ షాపులను అరికడుతామని హామీ ఇచ్చి దాని ఊసు ఎత్తడం లేదు అన్నారు. జిల్లాలోని అబ్కారీశాఖ అధికారులు ముడుపులకు అలవాటు పడి వైన్స్ ను నియంత్రించాల్సింది పోయి చోద్యం చూస్తున్నారు అన్నారు. అన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని సిరికొండ, ధర్పల్లి వైన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్, మండల నాయకులు దామోదర్, సాయరెడ్డి, రమేష్, ఆశిస్ పాల్గొన్నారు

గెస్ట్ లెక్చరర్లకు రెన్యూవల్ చేసి ఆదుకోవాలి

మామిడి విట్టల్

నవతెలంగాణ-ధర్పల్లి

ప్రభుత్వ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్ లెక్చరర్స్ ను రేనువల్ చేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి గెస్ట్ లెక్చరర్లను ఆదుకోవాలని తెలంగాణ ప్రభుత్వ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి విట్టల్ విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా అయన శనివారం విలేకరులతో పట్లాడుతూ గత నెల జులై31వరకు విధులను నిర్వహించిన లెక్చరర్లు రెన్యువల్ కాక క్కు తోచని పరిస్థితిలో ఉన్నారని వాపోయారు. వారికి తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఈసందర్భంగా విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలో శనివారం జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్ పర్యటించారు. వేంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు వెంకట్ నర్సయ్య కుమారుడు చరణ్ జేఈఈ అడ్వాన్స్ ఆల్ ఇండియా ఫలితాల్లో 51వ ర్యాంక్ సాధించడంతో అభినందించారు. అదేవిధంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ ఏలేటి మల్లికార్జున రెడ్డి, బీజేపీ నాయకులు నిమ్మల శ్రీనివాస్, గడ్డం సంతోష్ రెడ్డి, చిల్క దినేష్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నాయకుడు పద్మ, లోక రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షులుగా కొత్తపల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ పీఆర్టీయూ మండల అధ్యక్షులుగా కొత్తపల్లి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు సామ ప్రసాద్ శనివారం రోజు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా కొండ్రు నవీన్, మండల అసోసియేట్ అధ్యక్షులుగా జి.రవి కుమార్, మండల కార్యదర్శిగా జి.రాజేశ్వర్, మహిళా ఉపాధ్యక్షురాలుగా ఇంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పీఆర్టీయూ కార్యవర్గానికి తోటి ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ముందుంటానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న కాడి చెరువు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులో ఉన్న కాడి చెరువు అలుగు పారుతుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో కాడి చెరువు చుట్టూ ఉన్న గుట్టల నుండి వరద నీరు భారీగా చెరువులోకి వచ్చి చేరింది. దీంతో చెరువు పూర్తిస్థాయిలో నుండి శనివారం ఉదయం చెరువు అలుగు పారడం ప్రారంభమైంది. మండలంలోని అతిపెద్ద చెరువుగా పేరుందిన కాడి చెరువు అలుగు పారడంతో బషీరాబాద్ గ్రామస్తులతో పాటు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువు ఆయకట్టు పరిధిలో పంటల సాగుకు ఎలాంటి ఢోకాలేదని రైతుల పేర్కొంటున్నారు. మండలంలో పెద్దదైన కాడి చెరువు మత్తడి దూకుతుండడంతో అన్ని గ్రామాల్లో చెరువులు అలుగులు పారేందుకు సిద్ధంగా ఉన్నాయని రైతులు అంటున్నారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

- రెండున్నర తులాల బంగారం, 20 తులాల వెండి, నగదు చోరీ

నవతెలంగాణ-గాంధారి



మండల కేంద్రంలోని నరేంద్రనగర్ కాలనీలో గల పత్తి శ్రీనివాస్ తన కుటుంబతో సహా శుక్రవారం రాత్రి 9 గంటలకు మర్కల్ గ్రామానికి వాళ్ళ బంధువుల ఇంటికి ఫంక్షన్ నిమిత్తం వెళ్లి రాత్రి 11:30 గంటల సమయంలో తిరిగి వచ్చారు. ఇంటికి వచ్చిచూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల కొట్టి ఇంట్లో బీరువాలో గల రెండున్నర తులాల బంగారం, ఇరవై తులాల వెండి, నగదును ఎత్తుకెళ్లారు. పత్తి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాలూర పీహెచ్‌సీ డాక్టర్ బదిలీ

నవతెలంగాణ-బోధన్

సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాజ్‌కుమార్‌ను నిజామాబాద్ సెంట్రల్ జైలుకు బదిలీ చేస్తూ శుక్రవారం జిల్లా వైద్యాధికారి రాజశ్రీ ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీగా ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులో ఖైదీల వైద్య అవసరాలను చూసేందుకు నిజామాబాద్ సెంట్రల్ జైలులో ఖాళీగా ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా బదిలీ చేశారు. తక్షణమే నిజామాబాద్ సెంట్రల్ జైలులో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో సూచించారు. జూలై నెలలో సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వచ్చిన డాక్టర్ రాజ్‌కుమార్‌ను తిరిగి సెంట్రల్ జైలులో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా బదిలీ చేశారు. అసలే పీహెచ్‌లో రెగ్యులర్ వైద్యులు లేక రోగులకు నాణ్యమైన వైద్యం అందడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఉన్న వైద్యుడిని బదిలీ చేయడంతో రోగులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

చరిత్రే అన్నింటికీ ఆధారం

- వెల్లడించిన పలువురు వక్తలు
- 'తెలంగాణ చరిత్ర-వారసత్వం'పై చర్చావేదిక

నవతెలంగాణ-దోమకొండ



గడీకోటలో వక్తలు, విద్యార్థులు

చరిత్రే అన్నింటికీ ఆధారమని పలువురు వక్తలు సూచించారు. మండల కేంద్రంలోని గడికోటలో తెలంగాణ చరిత్ర వారసత్వం అనే అంశంపై తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణం భాష సంస్కృతి తెలంగాణ భాష, సంస్కృతి శాఖ, దోమకొండ పోర్ట్ సంయుక్తంగా నిర్వహించిన చర్చవేదిక కార్యక్రమనికి తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు అడప సత్యనారాయణ, డాక్టర్ దేమి రాజిరెడ్డి, ప్రోగ్రాం డైరెక్టర్ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్ర పూర్వకాలం నుంచి ప్రస్తుత కాలం వరకు అనే అంశం యావత్తు విద్యార్థులు లోకానికి ఉపయోగపడుతుందని తెలిపారు. చరిత్ర అనేది ప్రతి అంశానికి సంబంధించిందని, ప్రతి సబ్జెక్టుకు చరిత్రనే అన్నింటికీ ఆధారమన్నారు. చరిత్ర తెలియని వ్యక్తి చరిత్ర హీనుడిగా మిగులుతారని తెలిపారు. విద్యార్థి జీవితంలో నుంచి మనిషి జీవితం ఉన్నత స్థాయికి ఎదగాలంటే చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. చర్చ వేదికలో ఈ సందర్భంగా డాక్టర్ దేమీ రాజిరెడ్డి మాట్లాడుతూ శాతవాహన కాలం నాటి నాణ్యాలు, ఆనాటి చరిత్ర, ఆధారాలు అనే అంశంపై భారతదేశ చరిత్రలో శాతవాహన కాలంలో తెలంగాణకు గొప్ప చరిత్ర ఉందని వివరించారు. కోటిలింగాలను ఆధారంగా చేసుకుని భారత దేశంలోని మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒడిస్సా, కర్నాటక ప్రాంతాలను పరిపాలించారని తెలిపారు. మొట్టమొదటిసారిగా భారతదేశ చరిత్రలో సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత శాతవాహనులదేనని అన్నారు, శాతవాహనులు దేశంలోని బంగారు, వెండి, రాగి నాణేలు, వీరి నాణేలు ఏనుగు ముద్రతో ఉండేవి వాడారని తెలిపారు. వీరి చరిత్ర 2000 సంవత్సరాల క్రితం నాటిదని, అమరావతి, పనిగిరి, సాంచి వంటి ప్రముఖ కట్టడాలను నిర్మించారని, వీరి చరిత్రను కొండాపూర్ మ్యూజియంలో కేంద్ర ప్రభుత్వం భద్రపరిచిందని వివరించారు. తెలంగాణ అభివృద్ధిలో వీరి పాత్ర అమోఘమన్నారు. సిర్నాపల్లి సంస్థానాధిపతి డాక్టర్ అనురాధ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని సంస్థానాల పాత్ర అనే అంశంపై వివరిస్తూ బ్రిటిష్ నిజాం కాలంలో సంస్థానాలు ప్రజలకు ఏ విధంగా సేవలందించాయో ప్రజలకు రవాణా సౌకర్యాలు, తాగునీటి కోసం చెరువులు, ఉపాధి కోసం అవకాశాలు కల్పించారని తెలిపారు. తెలంగాణ సంస్థానాల వివరాలను తెలియజేశారు. ముఖ్య అతిథి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు అడప సత్యనారాయణ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ఆర్థిక, సామాజిక వ్యవస్థ అనే అంశంపై మాట్లాడుతూ గత సామాజిక రుగ్మతలను, ఆ కాలంలో నాటి జోగిని వ్యవస్థ గురించి, కులవివక్ష, బానిసత్వం గురించి, కుష్టివ్యాధి నిర్మూలన కోసం డిచ్‌పల్లిలోని సీఎంసి నిర్మించిన ఆరోగ్య కేంద్రం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తెలంగాణ బోనాలతో నృత్యం ద్వారా ప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ఉస్మానియా ఆర్కియాలజీ అధ్యాపకులు డాక్టర్ శివానంద్ యాలాల మాట్లాడుతూ యువత దేశం చరిత్ర సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఆధారపడిందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్, కో డైరెక్టర్ డాక్టర్ బండిల అంజయ్య, డాక్టర్ రాజేశ్వరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్ నారాయణ గుప్తా, డాక్టర్ టీ ప్రతిజ్ఞ, దోమకొండ పోర్టు డైరెక్టర్ శ్రీ బాబ్జి, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ డాక్టర్ వెంకటరెడ్డి, పోతన్న, రమేష్, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కుమార్, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మారయ్య గౌడ్, ఆర్కే డిగ్రీ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, గురు గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ గురువేందర్ రెడ్డి, మంజీరా కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్ సురేష్‌గౌడ్, ఎస్ఎస్ఆర్ ప్రిన్సిపాల్ రవీందర్ గౌడ్, హిస్టరీ అధ్యాపకులు పోతన్న, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ రమేష్ దక్షిణ ప్రాంగణ అధ్యాపకులు డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ హరిత, డాక్టర్ లలిత, డాక్టర్ సునీత, డాక్టర్ యాలాద్రి, ఉమెన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ వైశాలి, ఏపీఆర్ఓ సరిత, దిలీప్, శ్రీకాంత్ విద్యార్థి నాయకులు డాక్టర్ రాహుల్, డాక్టర్ సంతోష్, వివిధ కళాశాలల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కళాకారుడు మృతి



నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని భవానీపేట గ్రామానికి చెందిన మంగలి రాజు అనే కళాకారుడు శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కుమారులున్నారు. కళాకారుడు మృతి చెందడంతో తోటి కళాకారుల రోదనలు మిన్నంటాయి.

స్వర్గరథం అందజేత



స్వర్గరథం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని తానాకాలన్ గ్రామానికి చెందిన మంగళపల్లి నర్సింలు అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన తల్లిదండ్రులు మంగళపల్లి సరస్వతి, పెద్ద గంగారం జ్ఞాపకార్థం రూ.50 వేలతో స్వర్గరథాన్ని శనివారం గ్రామానికి అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పాల్దు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకుల, సురేష్, గ్రామ పెద్దలు రాజారెడ్డి, అరవింద్, గోపికృష్ణ, శ్రీనివాస్, సూర సంతోష్‌రెడ్డి, గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 79 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మోబిన్ ఖాన్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, జి.సాయిరెడ్డి, ధనుంజయ్, జావీద్ ఉద్దీన్, సురేందర్ గౌడ్, నరసయ్య, లచ్చేవార్ నితీన్, సాయిబాబా గౌడ్, కురుమేశ్రిని వాస్, గంగాకృష్ణ, గియాసోద్దీన్, రవి, ప్రభాకర్, సురేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద సీఐ, మద్నూర్ ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలంలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండలంలోని పెద్ద టాక్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిలు గొండా,విలాస్, ఆశిఫ్ దేశాయ్, దిలిప్ కుమార్ తదితరులు కలిసి వేర్వేరుగా బిచ్కుంద సీఐ నరేష్ కు అలాగే మద్నూర్ ఎస్సై విజయ్ కొండాకు శాలువాలతో ఘనంగా సత్కరించారు సత్కరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు సిఐ,ఎస్ఐలు ధన్యవాదాలు తెలిపారు.

పాఠశాలకు మైకు స్పీకర్లు అందజేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో గత విద్యా సంవత్సరం వరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లి ఉపాధ్యాయులు శనివారం అన్నాసాగర్ ప్రభుత్వ పాఠశాలకు అహుజా కంపెనీ ఫోర్ టేబుల్ మైకు, స్పీకర్లను బాహుకరించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ పెరుగు నాగరాజు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు జోసఫ్ రత్నాకాంత్, సిద్ధిరామగౌడ్ ఇరువురు కలిసి బదిలిపై వెళ్లినప్పటికీ పాఠశాలకు అవసరమైన ఈ పరికరాలను బహుమానంగా అందించడం ఎంతో అభినందనీయమని, వారికి పాఠశాలపై ఎంతో అభిమానం ఉందని పేర్కొన్నారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విగ్నేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మేక మృత్యువాత

నవతెలంగాణ-రామారెడ్డి



విద్యుత్ షాక్‌తో మేక మృత్యువాత చెందింది. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఘన్పూర్ తండాకు చెందిన భూక్య మోతి రామ్‌కు చెందిన మేకలు గ్రామ పొలిమేరలో మేపుతూ ఉండగా ట్రాన్స్‌ఫారం వద్ద మేకపోతుకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన మేక విలువ దాదాపు రూ.10,000 ఉంటుంది. విద్యుత్ అధికారులు, ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

జిల్లాస్థాయి బాలబాలికల సబ్ జూనియర్ టెన్నికాయిట్ టోర్నమెంట్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల రెడ్డిపేటలో ఈనెల 28వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి బాల బాలికల సబ్ జూనియర్ టెన్నికాయిట్ టోర్నమెంట్ ఎంపిక ఉంటుందని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సాయి మౌర్య, ఫిజికల్ డైరెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, క్రీడా దుస్తులతో పాల్గొనాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు, ఏడవ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ టోర్నమెంట్ ఆర్మూర్ మినీ స్టేడియంలో సెప్టెంబర్ 1 నుండి 3 తేదీ వరకు నిర్వహించే క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

సమగ్ర కులగణన చేయాల్సిందే

- బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజ్

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్రంలో కులగణన చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో నీల నాగరాజ్ మాట్లాడుతూ.. సమగ్ర కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు 42శాతం పెంచాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన బీసీ జనగణన విషయమై ఇప్పటి వరకు ప్రభుతం స్పందన లేదన్నారు. కులగణన వెంటనే చేయకపోతే ప్రభుత్వాన్ని గద్దె దింపేవరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంబీసీ సంఘం జిల్లా అధ్యక్షులు మఠం విజయ్ కుమార్, టౌన్ అధ్యక్షులు మాయాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, దయాకర్, నాయకులు రమేష్, నరేష్, ప్రవీణ్, రాజేందర్, యోగేష్, ప్రశాంత్, శ్రీధర్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-లింగంపేట్



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని బీసీ, ఎస్సి హాస్టల్ విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య లింగంపేట్ వారి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు శనివారం నిర్వహించినట్టు వైద్యాధికారి హిమబిందు తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్లో 75మంది, ఎస్సీ హాస్టల్లో 56 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ ఫరీదా, యాదగిరి, రాజేశ్వరి, భాగ్య ఆశలు తదితరున్నారు.

మాజీ స్పీకర్‌కు సన్మానం

నవతెలంగాణ-వర్ని



స్పీకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులుగా ప్రభుత్వం నియమించినందుకు గానూ చందూర్ కాంగ్రెస్ మండల నాయకులు, లక్ష్మాపూర్ గ్రామ నాయకులు ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు రాష్ట్ర కేబినెట్ హోదా ఇచ్చినందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. పిఏసిఎస్ చైర్మన్ ప్యారం అశోక్, లక్ష్మపూర్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, కర్లం సాయరెడ్డి, రాంరెడ్డి, మాధపురం రాంరెడ్డి,సంజీవ్, రాములు, మైసయ్య ముజ్జు, సాయిలు తదితరులున్నారు.

గడ్డిమందు పిచికారీ

నవతెలంగాణ-వర్ని

మండలంలోని ఎస్ఎన్‌పురం గ్రామంలోని పలు కాలనీల్లో పిచ్చిమొక్కల నివారణకు గడ్డి మందును పిచికారీ చేయించినట్టు పంచాయతీ సెక్రెటరీ సాయిలు తెలిపారు.

లింగంపేట్‌లో రైతు రచ్చబండ

నవతెలంగాణ-లింగంపేట్

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మండలాధ్యక్షులు మాసల శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పెద్దమ్మ గుడిలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు రాజారాం బాలయ్య ఆధ్వర్యంలో రైతు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

రేషన్‌షాప్ ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో హరిజనవాడ కాలనీలో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కాలనీ యువకులు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. కాలనీలోని ప్రజలు రేషన్ సరుకుల కొరకు కిలోమీటర్ దూరం వెళ్లి సరుకులు తీసుకోవలసి వస్తుందని, వృద్ధులకు, పెద్దవారికి రేషన్ సరుకుల కొరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యువత అధ్యక్షులు ప్రభాకర్, సామర్థ్య, రజనీకాంత్, స్వామి, భరత్, శ్రావణ్, తదితరులున్నారు.

డబుల్ బెడ్ రూమ్‌లు పరిశీలన

నవతెలంగాణ-కామారెడ్డి

ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్‌లను కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి కామారెడ్డి పరిధిలోని పాత రాజంపేట్ ఆరవ వార్డులోని, ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్‌లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీవాసులు ఎన్నో రోజుల నుంచి విద్యుత్ లేక బాధపడుతున్న విషయం తెలుసుకొని వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారి డి.ఈ కళ్యాణ్ చక్రవర్తికి ఫోన్లో సమాచారం అందించారు. మున్సిపల్ కౌన్సిల్, అధికారుల బృందంతో వెళ్లి ఎక్కడెక్కడ సమస్య ఉందో తెలుసుకొని డి.ఈకి తెలియజేశారు. డిఈ వెంటనే ఇక్కడున్న సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలని, మున్సిపల్ అధికారులకు చైర్‌పర్సన్ సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ వార్డ్ కౌన్సిలర్, ఆకుల రూప రవి, పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల జోలికొస్తే ఊరుకోం

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న కొత్త నరసింహులు

రైతుల జోలికొస్తే ఊరుకోమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు అన్నారు. శనివారం జిల్లాలోని మాచారెడ్డి మండలం ఎల్లంపేట, నడిమి తండాలో పోడు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పోడు రైతులకు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశంలో ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి పోడు భూములకు పట్టాలు ఇస్తామని స్వయంగా అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినప్పటికీ జిల్లాలో ఉన్న ఫారెస్ట్ అధికారులు దానిని పక్కనపెట్టి రైతులపై, గిరిజనులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గిరిజన రైతులను ఇబ్బంది పెడుతున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తమ పోరాటం ఇక్కడున్న నాయకులకు వ్యతిరేకం కాదని, పనిచేయని అధికారులతో, ప్రభుత్వంతో పోరాడుతున్నామని స్పష్టం చేశారు. గిరిజనులను ఉద్యమంలో పాల్గొనకుండా ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన ఉద్యమించి తీరుతామన్నారు. కుట్రలను తిప్పి కొట్టి పోరాడి గెలవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాకాస జిల్లా అధ్యక్షులు వెంకట్, జిల్లా నాయకుల లిబియా, నరహరి భూక్య, మాన్సింగ్ భూక్య, దశరథ్, భూక్యరవి, భూక్య బంగ్లా, భూక్య పరుశురాం, మోతిరం, భారతి, బూలి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు తమపేరు నమోదు చేసుకుని లబ్దిపొందాలి

కలెక్టర్ ఆశీస్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ అశీష్ సాంగ్వాన్

ప్రతి ఒక్క భవన, ఇతర నిర్మాణ కార్మికులు కార్మిక శాఖలో తమ పేరు నమోదు చేసుకొని లబ్ధిపొందాలని జిల్లా కలెక్టర్ ఆశీస్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశం మందిరంలో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమంపై జిల్లా స్థాయి అధికారుల సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్మిక చట్టం ప్రకారం భవనం, ఇతర నిర్మాణాలు జరుగుతున్నప్పుడు వాటి నిర్మాణానికి అయ్యే వ్యయం విలువలో ఒక శాతం సెస్ వసూలు చేసి కార్మిక శాఖకు సమర్పించాలని అన్నారు. అదేవిధంగా చట్ట ప్రకారంగా ప్రభుత్వ అధికారులు ఎవరైతే పనుల నిర్ణయించేవారు, నిర్మాణమునకు అనుమతులు ఇచ్చే అధికారులు ఒక శాతం లేబర్ సెస్ వసూలు చేసి కార్మిక సంక్షేమ బోర్డుకు జమచేయాలని అన్నారు. ఈ విధంగా వసూలు చేసిన సెస్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉపయోగించనున్నట్టు వివరించారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి

నవతెలంగాణ-మద్నూర్



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మద్నూర్ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే ఆదేశాల అనుసారంగా మండలంలోని చిన్నతడ్గూర్ గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాయకత్వంలో జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధిలో ముందు వరుసలో దూసుకుపోతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చౌలావర్ హన్మండ్లు స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్‌పటేల్, పార్టీ మాజీ మండలాధ్యక్షులు వట్నాల్వర్ రమేష్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞ కుమార్, కొండావార్ రాజన్న, ఇరాన్న, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్, ఖరగ్ గ్రామ మాధవరావు పాటిల్, బండివార్ గోపి, బాలు యాదవ్, యువ నాయకులు, అమూల్ షిండే, గ్రామ అధ్యక్షులు గంగారాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని చిన్నఎక్లారా గ్రామంలో పత్తి, సోయాబీన్, కంది పంటలను మండల వ్యవసాయ అధికారి రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు తగు సూచనలు చేశారు. సోయాబీన్ పంటలో ప్రధానంగా కాండపు ఈగ ఆశించినట్లు గమనించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగులైన తామర పురుగు, పచ్చ పురుగు, తెల్ల దోమలను గమనించినట్టు ఆయన తెలిపారు.

డెంగ్యూ బాధితుడికి ప్లేట్ లెట్స్ అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన దీప శివశంకర్ దేశ్ముఖ్ (24) పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో డెంగ్యూ వ్యాధితో బాధపడుతుండడంతో తెల్ల రక్త కణాల సంఖ్య పడిపోయింది. దీంతో ఆయనకు కావలసిన బి నెగిటివ్ కణాలు దొరకకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలును సంప్రదించడంతో వెంటనే స్పందించి జిల్లా కేంద్రంలోని ఆయుష్ బ్లడ్ బ్యాంకులో వారికి కావాల్సిన రక్త కణాలను అందజేసినట్టు బాలు తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మాక్లూర్



మండలంలోని బోర్గం(కె), అమ్రాద్ గ్రామాల్లో సిఎం సహాయనిధి చెక్కులను ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లో అందరూ కలసి కట్టుగా అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. రానున్న రోజుల్లో రేషన్ కార్డులు, పింఛన్లు అందుతాయని అన్నారు. ఇల్లు లేనివారికి ఇల్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, రమేశ్, మోహన్ చిన్నప్పుర్ వినోద్, రమేష్ నాయక్, సంతోష్, గంగారెడ్డి, మెడీద గంగాధర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

26న 'శ్రీ కృష్ణ జన్మాష్టమి' వేడుకలు

నవతెలంగాణ-ముప్కాల్

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈ నెల 26న సోమవారం యాదవ పెద్ద సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు 'శ్రీ కృష్ణ యాదవ పెద్ద సంఘం' అధ్యక్షులు బొట్ల సాయన్న, కట్ట గోపిలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యాదవ సంఘం కోశాధికారి కట్ట మహేష్ యాదవ్ మాట్లాడుతూ సోమవారం ఉదయం అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం శ్రీవారి ఊరేగింపు, సాయంత్రం 5 గంటల సమయంలో మార్కెట్ యార్డ్ స్థలంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో యువకులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. వేంపల్లి, వెంచిర్యాల గ్రామాల్లో సైతం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు కట్ట భూమేష్, గోల్లన ప్రశాంత్, ముద్దు చిన్నయ్య, గొర్రె చిన్న రాములు, కుర్మా పోతన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలి

- గెస్ట్ ఫ్యాకల్టీ ప్రొసీడింగ్స్‌ని వెంటనే ఇవ్వాలి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు వెంటనే అందించాలని, గెస్ట్ ఫ్యాకల్టీ ప్రొసీడింగ్స్‌ని వెంటనే ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రెండోరోజు ఎస్ఎఫ్ఐ సమరభేరి మోటార్ సైకిల్ యాత్రను బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఈవిల్ నారాయణ ప్రారంభించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండోరోజు యాత్ర స్థానిక మిర్చి కాంపౌండ్‌లోని బీసీ హాస్టల్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ యాత్ర ద్వారా విద్యార్థుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో అకాడమిక్ ఇయర్ సంబంధించి రెండు నెలలు గడుస్తున్న కొన్ని కళాశాలలో టెక్స్ట్‌బుక్స్ రాకపోవడం బాధాకరమని అన్నారు. అనేక కళాశాలలో మౌలిక సదుపాయాల కొరత అధికంగా ఉందని అవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకడమిక్ ప్రారంభం ఐన ఇప్పటి వరకూ గెస్ట్ ఫ్యాకల్టీ ప్రొసీడింగ్స్ ఇవ్వాలి. టీచర్ల బదిలీలు జరిగడంతో విద్యార్థులకు క్లాసులు జరగని పరిస్థితి నెలకొందని ఈ పరిస్థితిని డిఐఈఓ చక్కదిద్దాలని అన్నారు. ప్రభుత్వ విద్యకు అధిక నిధులు ఇచ్చి అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని అన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ, పిఈటి పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, జిల్లా కమిటీ సభ్యులు శివ, దినేష్, బాపురావు, నాయకులు కార్తీక్, వరదరాజు, జీషన్, తదితరులు పాల్గొన్నారు.



యాత్ర సందర్భంగా మాట్లాడుతున్న విగ్నేష్

కోనసముందర్‌లో ఆరోగ్య శిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోన సముందర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో చౌట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ సుప్రియ తెలిపారు. ఈ సందర్భంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు వచ్చే సీజనల్ వ్యాధులపై డాక్టర్ సుప్రియ అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చని ఆమె వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ, ఏఎన్ఎం అమృత, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జెడబ్ల్యూహెచ్ఆర్‌సి మండల అధ్యక్షునిగా తొగరి సాయిలు నియామకం

- నియామకపత్రం అందజేసిన జిల్లా అధ్యక్షులు కొప్పు రాజేందర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల అధ్యక్షులుగా జక్రాన్‌పల్లి మండలకేంద్రానికి చెందిన తొగరి సాయిలును నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్ అధికారికంగా నియమించారు. శనివారం మండల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు కొప్పు రాజేందర్ నియామక పత్రం సంస్థ గుర్తింపు కార్డు అందజేశారు. ఈసందర్భంగా కొప్పురాజేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవ హక్కుల పరిర్షణకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వానికి, పోలీసులకు తాము సహకారంగా ఉంటామని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో కేసు ఫైల్ చేసి నిజమైన బాధితులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. మండల అధ్యక్షులుగా తొగరి సాయిలు బాధ్యతగా పనిచేసి న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తొగరి సాయిలు మాట్లాడుతూ తన నియామకానికి సహకారం అందించిన నేషనల్ జనరల్ సెక్రెటరీ మామిడాల మనోహర్, సౌత్ ఇండియా చైర్మన్ హన్మ గౌడ్, రాష్ట్ర చైర్మన్ నోముల సంపత్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. భారత రాజ్యాంగానికి, చట్టానికి కట్టుబడి పని చేస్తానని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ ఏనుగంటి రాజశేఖర్, రాష్ట్ర సెక్రెటరీ బట్టి దత్తాత్రి గౌడ్. జిల్లా కార్యదర్శి పసుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ధర్నాకు తరలి వెళ్లిన రైతులు



ధర్నాకు వెళ్తున్న రైతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో చేపట్టిన రైతు నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని ఆయా గ్రామాల నుండి రైతులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయాగ్రామాల నుండి తరలి వెళ్లి నాయకులు మాట్లాడుతూ కమ్మర్‌పల్లి మండలంలో 6815 రైతులు రుణాలు తీసుకుంటే కేవలం2652 మందికి మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. మిగిలిన 4161 రైతులకు తక్షణమే ప్రభుత్వం బ్యాంకుల నుండి లిస్టు తెప్పించుకొని నేరుగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైతాంగాన్ని నిండా ముంచాడని విమర్శించారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కే.శివప్రసాద్



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా సైకియాట్రిక్ హెచ్వోడీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కే.శివ ప్రసాద్‌కు ప్రమోషన్ పొందారు. హెల్త్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెక్రెటరీ ఒక ప్రకటన విడుదల చేశారు

మాక్లూర్‌లో వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 58మందికి బిపి, షుగర్ పరీక్షలను నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. సాధారణ జ్వరం ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వెంకట్, సూపర్ వైజర్ మమత, ఏఎన్ఎం అనురాధ, గ్రామపంచాయతీ కార్యదర్శి రాకేష్, ఆశావర్కర్లు శిరీష, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సాహితీ నింగిలో ధ్రువతార దాశరథి రంగాచార్య

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ దార్శనికత సాహిత్య మకుటంగా సాహితీ నింగిలో ధ్రువతారగా నిలిచిన దాశరథి రంగాచార్య అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, సాహితివేత్త దాశరథి రంగాచార్య 96వ జయంతి సందర్భంగా సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ఉపాధ్యాయులతో కలిసి దాశరథి రంగాచార్య చిత్రపటానికి పూలమాలనలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో పెన్ను అనే గన్నుతో పోరాడిన సాహసి, నిజాం నిరంకుశత్వాన్ని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తన రచనలతో ఎదిరించిన అభ్యుదయవాది. ప్రజల దుర్భర పరిస్థితులను, దారుణమైన బానిస బతుకుల గురించి తన 'చిల్లర దేవుళ్ళు' నవలలో వివరించారు. అమృతంగమయ మాధుర్యం చూపించాడు. మాయ జలతారుతో మైమరిపించారు. అప్పటి సమాజంలో ప్రజల బానిస బతుకుల స్థితిగతులను మోదుగ పూలు నవలలో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. వామపక్ష తీవ్రవాదిగా ప్రజల పక్షాన నిలిచిన దాశరథి నూతన సమాజం నిర్మాణం కోసం తాపత్రయపడిన ఉద్యమశీలి అని కొనియాడారు. సాంస్కృతిక స్వేచ్ఛ కోసం,అస్తిత్వంకోసం,భూమికోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి అంతంకోసం, నిజాంపాలనను తుదముట్టించడం కోసం ఆనాటి అభ్యుదయ సమాజం ఎలాసంఘటితమై పోరాడిందో ఆ పోరాటపటిమ దాశరథి రచనల్లో కనిపిస్తోందన్నారు. మహనీయుల జీవిత ఇతి వృత్తాలను స్ఫూర్తిగా తీసుకొని ఆదర్శప్రాయమైన ఆలోచనలతో శ్రమించి ఉన్నత స్థాయికి చే కలలకు మనం సోపానాలు కావలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయుల

మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆగస్టు 31,సెప్టెంబర్ 1,2 తేదీలలో హైదారాబాద్‌లో జరిగే ప్రగతీ శీల మహిళా సంఘం 7వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ కోరారు. శనివారం రాష్ట్ర మహాసభల పోస్టర్స్‌ను నగరంలో కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ.. నేడు దేశంలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని నిత్యం హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, మహిళ చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయటం లేదని, ప్రగతీ శీల మహిళా సంఘం పిఓడబ్ల్యు తెలంగాణ 7వ రాష్ట్ర మహాసభలు నిర్వహించుకుంటుంది. ఈ మహాసభలో మహిళా ఉద్యమ కర్తవ్యాలను భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర మహాసభలకు వివిధ రాష్ట్రాల నుండి మహిళా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఓడబ్ల్యు నగర అధ్యక్ష కార్యదర్శులు నీలం లక్ష్మి, గొంట్యల సంజన, నాయకులు స్వప్న, అనంత, రేఖ, రాజేశ్వరి, పిడిఎస్యు జిల్లా నాయకురాలు దేవిక, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పట్టాను అందుకున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-అర్మూర్

పురపాలక ఉమ్మడి గ్రామాలైన పెర్కిట్ మామిడిపల్లిలతో కూడిన తొలి మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టాను శనివారం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి పామిడిగంటమ్ నరసింహమ్‌తో డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. పండిత్ వినీతపవనన్ గతంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులను నిర్వహించారు. ప్రొఫెసర్‌గా ఉన్న సమయంలో విద్యపై ఉన్న మమకారంతో పీహెచ్‌డీ చేయాలని పట్టుదలతో గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో అడ్మిషన్ తీసుకున్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికలో పోటీచేసి తొలి ప్రయత్నంలోనే పురపాలక గ్రేడ్ -2 తొలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పండిత్ వినీత పవన్ ఎన్నికయ్యారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జూనియర్ డాక్టర్ హత్య, హత్యాచారంపై నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా బ్యాంక్ ఉద్యోగస్తుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తూ ఎన్‌డిసిసిబిహెడ్ ఆఫీసు వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ సిహెచ్ మనోజ్‌సింగ్, మహిళా కన్వీనర్ రాధ, స్రవంతి, మౌనిక, శ్రీలత, సౌమ్య, వెంకటేష్, నవీన్, మాధవ్ జోషి, శంకరయ్య, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అనన్య కుటుంబానికి నష్టపరిహారం అందించేలా చూడాలి

- బీఆర్ఎస్ నాయకుల వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నాలలో పడి మరణించిన అనన్య కుటుంబానికి నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం చూడాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. శనివారం మాజీ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆదేశానుసారం బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఇటీవల కురిసిన భారీ వర్షానికి వర్ని రోడ్లో గల నాలాలో పడి అనన్య(2) మృతి పట్ల బిగాల ఆర్థిక సహాయం అందించారు. అనన్య కుటుంబ పరిస్థితిని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యేకు వివరించగా చలించి పోయి వెంటనే జిల్లా కలెక్టర్‌కి ఫోన్ చేసి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. త్వరలోనే అనన్య కుటుంబ సభ్యులకు న్యాయం జరుతుందన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సిర్ప రాజు, కార్యదర్శి ఎనగందుల మురళి, సత్య ప్రకాష్, కార్పొరేటర్ విక్రమ్‌గౌడ్, పోల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగి యువకుడు మృతి

- అంత్యక్రియలకు వెళ్లగా ఘటన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తన కులంకు చెందిన ఒక వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలకు వెళ్లి తిరుగు ప్రయాణం కంటే ముందు పక్కనే ఉన్న మత్తడి వాగులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృత్యు ఒడిలోకి పోయిన ఘటన ఇందల్‌వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇందల్‌వాయి ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ సిర్నపల్లి గ్రామానికి చెందిన పోగుల రాహుల్(19) తన కులంకు చెందిన ఒక వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. రాహుల్ అంత్యక్రియలు ముగించుకొని పక్కనే ఉన్న మత్తడి వాగులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. పక్కన ఉన్న వారంతా వెతికిన కొన్ని గంటల వరకు రాహుల్ ఆచూకీ లభించలేదు. రాత్రి సమయంలో రాహుల్ మృతదేహం లభ్యమైంది. శనివారం మృతుని తండ్రి పోగుల రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు ఎస్ హెచ్ ఓ మనోజ్ కుమార్ తెలిపారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి



మొక్కను నాటుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-భీంగల్ రూరల్

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. మండలంలోని తాళ్లపల్లి, కారేపల్లి గ్రామాల్లో వన మహోత్సవం, శానిటైజేషన్ పనులపై గ్రామాలను శనివారం ఆయన సందర్శించారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు పారిశుధ్యంపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామప్రజలతో ఎంపీడీవో మాట్లాడుతూ.. చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి జావిద్, ఉపాధి హామీ ఏపీవో, జీ.నర్సయ్య పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ మండలంలోని ముచ్కూర్ గ్రామానికి చెందిన పొన్నాల గంగు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ద్వారా తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆమె వైద్య ఖర్చులకు 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పంపించారు. ఈరోజు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బూరెడ్డి సంతోష్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు కోరాడి రాజు, కొరాడి లింబాద్రీ, మురారి, రాంరెడ్డి, బసిర్ రాజు, పల్లె లింబన్న, అభి రెడ్డి, చిన్న గంగన్నగంగారెడ్డి, తెడ్డు అశోక్, నంగి రవి, లింబద్రి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌ను ముట్టడించిన తండా వాసులు

- సమస్య పరిష్కరించుకుంటే జాతీయ రహదారిపై బైఠాయిస్తాం
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గిరిజన గ్రామ పంచాయతీ పరిధిలో అనునిత్యం కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్నామని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యను పరిష్కరించకుండా చిన్న చూపు చూస్తున్నారని వెంటనే కరెంటును కోతలు లేకుండా నిరంతరంగా విద్యుత్ అందజేసే విధంగా చూడాలని డిమాండ్ చేస్తూ తండావాసులు శనివారం సబ్ స్టేషన్‌ను ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. శనివారం ఇందల్‌వాయి మండలంలోని మెగ్యానాయక్ తండా గ్రామ పంచాయతీకి చెందిన తండా వాసులు ఇందల్‌వాయి మండలంలోని గన్నారం సబ్‌స్టేషన్ ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలో అనునిత్యం కరెంటు కోత విధించడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఎన్నోసార్లు అధికారులకు విన్నవించిన సమస్యలను పరిష్కరించకుండా మీనమేషాలు లెక్కించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ స్టేషన్ వద్ద నిరసన సందర్భంగా లైన్ మెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లేష్, ఇందల్‌వాయి ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్‌లు విద్యుత్ సబ్ స్టేషన్‌కు చేరుకొని సమస్యలను విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. సమస్యలను అధికారులు పరిష్కరించకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేసి జాతీయ రహదారి 44పై బైటాయించి నిరసనలు, ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ నిరసనలో గణేష్ నాయక్, సదర్ నాయక్ మనిష్ రాం, నర్సింగ్, దర్శింగ్, దేవేందర్, హీరమన్, తండా వాసులు ఉన్నారు.



సబ్‌స్టేషన్‌లో బైఠాయించిన తండావాసులు

సమస్యను పరిష్కరించాం..
విద్యుత్‌శాఖ ఏఇ పండరినాథ్

శుక్రవారం రాత్రి వర్షం పడడంతో తాండలో ఇన్సులేటర్లు చెడిపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని, శనివారం వెంటనే మరమ్మతులు చేసి నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తున్నామని ఇందల్‌వాయి టీజీ ఎన్పీడీసీఎల్ ఏఈ పండరినాథ్ నవతెలంగాణకు వివరించారు. గతంలో అప్పు డప్పుడు ఇలాంటి సమస్య వస్తుందని కానీ తాము నిరంతరాయం విద్యుత్ను సరఫరా చేస్తున్నామని ఆయన వివరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

సాలురా మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫాతేపూర్, సాలంపాడ్ గ్రామాలలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో సాలూరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంధర్నా రవి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఖాజాపూర్ అశోక్, ఇల్తేపు రమేష్, బుద్దె లక్ష్మణ్, ప్రశాంత్, గౌస్, పద్మారెడ్డి, బాలకృష్ణ, గోపాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయానికి బారులు తీరిన భక్తులు


ఆలయానికి వస్తున్న భక్తులు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయానికి తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు పాదయాత్ర ద్వారా బారులు తీరుతూ వేలాదిగా తరలివచ్చి ఆలయాన్ని సందర్శించి శనివారం దర్శించుకున్నారు. శ్రావణమాసంలో భక్తులు ప్రతి శని, సోమ వారాల్లో ఆలయం కిక్కిరిస్తూ భక్తులతో సందడిగా కనిపిస్తోంది.

ముకుందా.. ముకుందా..

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- గోపికలు, కృష్ణుని వేషాధారణలో అలరించిన చిన్నారులు

నవతెలంగాణ-విలేకరులు

కృష్ణాష్టమి వేడుకలు జిల్లాల్లోని పలు పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషాధారణలో అలరించారు. ఉట్టికొట్టి అలరించా రు. విద్యార్థులకు పండుగ ప్రాధాన్యతను వివరించారు.

ఆర్మూర్ : స్మైల్స్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా శనివారం నిర్వహించినారు. చిన్నారులు రాధా, గోపిక, కృష్ణుడు వేషధారణలో వచ్చి సందడి చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ షబానా గోహర్ కృష్ణాష్టమి రోజు ఉపవాసాలు ఉంటూ భక్తిశ్రద్ధలతో ట్రెడిషనల్ పాటల్లో డాన్స్, డ్రామాలో పాల్గొంటూ స్వీట్స్ తినిపించి ట్రెడిషనల్ యాక్టివిటీస్, డివోషనల్ డ్రామా సాంగ్స్ నిర్వహించినారు. పిల్లలను ఉద్దేశించి పండగ ప్రాముఖ్యత డైరెక్టర్ రఫీ గౌహర్ వివరించారు. ఈ సెలబ్రేషన్స్‌లో పిల్లలు విద్యార్థి, విద్యార్థులు, తల్లిదండ్రులు స్టాఫ్ సవిత, స్వప్న, సింధుజ, ప్రసన్న, సరిత, రోజా, శ్రావణి, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని మిసిమి, కృష్ణవేణి ఉన్నత పాఠశాలల్లో గోపికలు, కృష్ణుడు వేషధారణలో విద్యార్థులు చేసిన నృత్యాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు శ్రీకృష్ణుని జీవిత చరిత్ర విద్యార్థులు వివరించారు. కృష్ణుడు వేషధారణలో ఉన్న విద్యార్థులు పోటీపడి ఉట్టిని కొట్టారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బాలే రవీందర్, కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ చిలుక గంగా ప్రసాద్, పాఠశాల డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ కుందారం సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మోర్తాడ్ : మండల కేంద్రంలోని పలు పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు ఘనంగా శనివారం నిర్వహించుకున్నారు. బాల బాలికలు కృష్ణుడు గోపిక వేషధారణలో ర్యాలీ నిర్వహిస్తూ గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఉట్టి కార్యక్రమాన్ని జరుపుకున్నారు.

బాల్కొండ : మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో విద్యార్థిని విద్యార్థులు దాండియా కోలాటాలు, ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థుల కృష్ణుడు, గోపికల వేషాధారణ చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కోటగిరి బాను చందర్, ఆకుల లక్ష్మణ్, ప్రిన్సిపల్ విజయ కర్తన్ పాల్గొన్నారు.

సిరికొండ : మండలంలోని కిడ్స్‌పార్క్ స్కూల్లో చిన్నారులు శ్రీకృష్ణుని గోపికల వేషధారణలతో ఉట్టి కొడుతూ నృత్యాలు చేస్తూ అలరించారు. చిన్న పిల్లల ఆటపాటలు వారు చేసిన అల్లరి అందర్నీ ఆకర్షించాయి. కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి పండుగ ప్రాముఖ్యత పిల్లలకు తెలిసేలా చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. విద్యతోపాటు సంస్కృతి సాంప్రదాయాల గురించి తెలియడం అవసరం అన్నారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని హసకొత్తూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా శనివారం నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు చిన్ని కృష్ణుడు, బాలికలు గోపికమ్మ వేషధారణలో అలరించారు. అనంతరం కృష్ణాష్టమి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే.వేణుగోపాల్, ఉపాధ్యాయులు అంజాద్ సుల్తాన్, పసుపుల ప్రసాద్, ఉపాధ్యాయినులు ప్రణతి, నిఖిత, సుప్రియ, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండలంలోని తడపాకల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుచున్న విద్యార్థిని,విద్యార్థులు కృష్ణుడు,గోపిక వేషాధారణలతో అలరించారు.


మోర్తాడ్‌లో...


భిక్నూర్: ఉట్టి కొడుతున్న చిన్నికృష్ణుడు


నిజామాబాద్: బ్రిలియంట్ స్కూల్‌లో క్రిష్ణాష్టమి వేడుకలు


గాంధారిలో...


కామారెడ్డి: అక్షర పాఠశాలలో...


ఏర్గట్లలో...


కమ్మర్‌పల్లిలో...


లింగంపేట్‌లో...

నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లుపై

అభిప్రాయ సేకరణ

- అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం : కలెక్టర్ వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ధరణి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన రెవెన్యూ చట్టం-2024 ముసాయిదాపై వివిధ వర్గాలవారి అభిప్రాయాలను సేకరించేందుకు వీలుగా శనివారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో చర్చా వేదిక కొనసాగింది. జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డితో పాటు న్యాయవాదులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరై నూతన రెవెన్యూ చట్టంలోని ముసాయిదా అంశాలపై సలహాలు, సూచనలు చేశా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చర్చా వేదిక ద్వారా వెల్లడైన అందరి అభిప్రాయాల ను క్రోడీకరించి ప్రభుత్వానికి పంపిస్తామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నూతన ఆర్.ఓ.ఆర్ ముసాయిదా బిల్లు-2024పై ప్రజల నుంచి సీసీఎల్ఏ వెబ్‌సైట్ ద్వారా సూచనలు, సలహాలు స్వీకరిం చడం జరిగిందని గుర్తుచే శారు. జిల్లా స్థాయిలోనూ మేధావులు, రెవెన్యూ చట్టం పట్ల అవగా హన కలిగి ఉన్న వారి అభిప్రాయాలను తెలుసుకోవాలనే ఉద్దేశ్యం తో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్చా వేదిక కార్యక్రమం నిర్వహిం చనున్నట్టు తెలిపారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు సైతం తమ దైనందిన విధుల నిర్వహణ సందర్భంగా గమనించిన అంశా లను ప్రభుత్వం దృష్టికి తేవాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన ముసాయిదా చట్టంలోని అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి తెలియజేశారు. ఎమ్మె ల్యేలు ధన్పాల్ సూర్య నారాయణ, రాకేష్‌రెడ్డిలు మాట్లాడుతూ, ప్రభుత్వం రూపొందించిన నూతన ముసాయిదా చట్టాన్ని స్వాగతి స్తున్నామని అన్నారు. అయితే, క్షేత్రస్థాయిలో చట్టాల అమలు పకడ్బందీగా జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చిన్న, సన్నకారు రైతులకు లబ్ధిచేకూరేలా, సత్వరమే వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా నూతన చట్టం దోహదపడాలని ఆకాంక్షిస్తూ, ఈ దిశగా అధికారులందరూ అంకితభావంతో విధులు నిర్వర్తిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తపర్చారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, ఆయా మండలాల తహసీల్దార్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. భూ సంబంధిత అంశాలతో కూడిన సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి, ఆర్డీఓలకు అప్పిలేట్ అథారిటీ అధికారం కల్పించాలని కోరారు. చర్చా వేదికకు హాజరైన రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులకు, న్యాయవాదులకు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులకు, రైతులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. చర్చా వేదికలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, అంబదాస్ రాజేశ్వర్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మూడు ఇసుక టిప్పర్లు పట్టివేత

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న మూడు ఇసుక టిప్పర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. వే బిల్లులతో పాటు ఎలాంటి అనుమతులు లేకుండా మూడు ఇసుకటిప్పర్లు అక్రమంగా బోధన్, నుండి నిజామాబాద్ వైపు శనివారం తెల్లవారుజామున వెళ్తుండటంతో పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్టు ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

టీచింగ్ లెర్నింగ్ పరిశీలించిన మండల నోడల్ అధికారి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని వడ్డేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫండమెంటల్ అండ్ లిట్రసీ న్యూమారికల్ బోధన పద్ధతిని నిజాంసాగర్ మండల నోడల్ అధికారి తిరుపతిరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థులతో పాఠ్యపుస్తకం చదవడం, విషయం గురించి ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు పాఠ్యం బోధించడం, పలు విషయాలపై ఆయన ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం ఎడ్యుకేషనల్ అప్లికేషన్లో బేసిక్ పాయింట్లను అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల టీచింగ్, లెర్నింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఫరీద్‌పేట్ శ్రీనివాస్ పిఎంపి కుటుంబానికి పీఎంపీ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో రూ.33 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాడిపల్లి బాలకిషన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నక్క శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.డిచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు గడీల చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్యుప్రెషర్, మ్యాగ్నెటిక్, వైబ్రేషన్ చికిత్స శిబిరం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో నేటి నుంచి 31వరకు ప్రతిరోజు ఉదయం 9 నుంచి 8గంటల వరకు ఆక్యుపెషర్, మాగ్నెటిక్, వైబ్రేషన్ చికిత్స శిబిరాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ వారి ఆధ్వర్యంలో, కాంగ్రెస్ మండల నాయకుల సహకారంతో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శనివారం తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆక్యుపెషర్ రీసెర్చ్, ట్రీట్మెంట్ సెంటర్ (రిజిస్టర్డ్), ప్రతాప్‌నగర్, జోదపూర్ డా.జితేందర్‌సింగ్, డా.ప్రమోద్ కుమార్‌చే చికిత్స చేయబడునని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్ హాజరవుతారని తెలిపారు.

బాన్సువాడలో రూ.37 కోట్లతో 100 పడకల ఆసుపత్రి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పోచారం
- నిర్మాణానికి శంకుస్థాప చేసిన బాన్సువాడ ఎమ్మెల్యే

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

బాన్సువాడ డివిజన్ కేంద్రంలో రూ.37 కోట్ల 50 లక్షల నిధులతో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ పట్టణంలోని పాత ఆసుపత్రి ఆవరణలో శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పోచా రం మాట్లాడుతూ.. బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు అనునిత్యం వస్తూనే ఉం టారని.. అలాగే మహారాష్ట్ర, కర్ణాటక పేద ప్రజలు ఇక్కడికి వచ్చి చికిత్స పొందుతారని అన్నారు. ప్రతిష్ఠాత్మకమైన బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రిడేషన్-గ్రేడ్-1 సర్టిఫికెట్ వచ్చిందని, ప్రారంభించిన ఏడాదిన్నరలోనే బాన్సువాడ మాతా-శిశు ఆసుపత్రికి బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రిడేషన్ గ్రేడ్ రావడం ఎంతో సంతోషకరమని తెలిపారు. రాష్ట్రంలోని ఏడుసార్లు ఉత్తమ ఆసుపత్రిగా అవార్డు రావడం భారతదేశంలోనే మదర్ బెస్ట్ ఫీడింగ్ ఆసుపత్రిలో మన ఆసుపత్రి చేరడం ఎంతో గర్వదగ్గ విషయమన్నారు. ఈ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నానని వివరించారు. బాన్సువాడ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని, తన సేవలను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు రాష్ట్ర ప్రభు త్వ వ్యవసాయ సలహాదారునిగా నియమించడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో రైతులు ఆందోళన చెందుతున్నారని, అందుకు కామారెడ్డి నిజామాబాద్ జిల్లా వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం ఈనెల 27న కామారెడ్డిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 28న సిద్దాపూర్ ప్రాజెక్ట్‌లో అటవీ భూములు ఇతర భూములు మునిగిపోతున్నాయని అందుకు జిల్లా ఇరిగేషన్ అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం ఉంద న్నారు. రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారునిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు వివరించారు. అందుకు బాన్సువాడ నియోజకవర్గం ప్రజలు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి రాక..

రూ.37 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వాసుపత్రి వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవానికి వస్తారని ఎలాగైనా ఒప్పించి బాన్సువాడకు ముఖ్యమంత్రిని తీసుకొస్తానని హామీ ఇచ్చారు. బాన్సువాడ ప్రభు త్వ భవనం నాణ్యత ప్రమాణాలతో ఆసుపత్రి కట్టాలన్నారు. 100 ఏండ్ల వరకు చెక్కుచెదరకుండా ఉండే విధంగా నాణ్యమైన సలాక, సిమెంటు, ఇసుక వాడాలన్నారు. వీటికి తోడు కలుషితమైన నీటిని కాకుండా శుభ్రమైన మంజీరా నీరు కట్టడం కోసం ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఇంజనీరింగ్ అధికారులు వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే